విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY
PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 24-10-2024 సంపుటి : 06 సంచిక : 30 పేజీలు : 8 వెల : రూ 3-00





## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణకు భక్తుల విరాళం..

విభారె న్యూస్ అక్టోబర్ 23 శ్రీశైలం..శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థాన అన్న ప్రసాద వితరణ పథకానికి కడియాల లోకేశ్వరరావు విజయవాడ వారు రు.1,00,116 లను, క్రాంతి రేఖ హైదరాబాద్ వారు రు.1,00,000 లు అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు సి మధుసూదన్ రెడ్డికి అందజేయడం జరిగినది. భక్తులకు దేవాల యం వారు తగు రసీదును, స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేసి, స్వామి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



# తీరం వైపు దూసుకొస్తున్న తుఫాన్



### నేటి అర్ధరాత్ర తీరం దాటే ఛాన్స్
### తీర ప్రాంతం వెంబడి బలమైన ఈదురుగాలులు
### సముద్రంలో అలజడి..వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచన

విశాఖపట్నం,అక్టోబర్ 23(ఆర్ఎన్ఎ): తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను గురువారానికి బలపడి తీవ్ర తుపాను గా మారుతుందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతానికి పారాదీప్‌కు 520 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉందన్నారు. వాతావరణ కేంద్రం అధికారులు మాట్లాడుతూ తుపాను గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాములోపు తీరం దాటే అవకాశం ఉందన్నారు. పూరీ-సాగర్ ద్వీపం మధ్య సమీపంలో తీరం దాటనుందని చెప్పారు. గంటకు 15 కిలోమీటర్ల వేగంతో తుపాను కదులుతోందని, దీని ప్రభావంతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని తీర ప్రాంతం వెంబడి బలమైన ఈదురుగాలులు వీయనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదు అని హెచ్చరించారు. అన్ని పోర్టులలో రెండో నెంబర్ హెచ్చరిక జారీ చేశామని వాతావరణ కేంద్రం అధికారులు వివరించారు. తూర్పుమధ్య బంగాళాఖాతంలో బలమైన తుపానుగా మారిన 'దానా' ముంచుకొస్తోంది. తీరం దాటనున్న నేపథ్యంలో ఆందోళన కలిగిస్తోంది. ప్రభావితం కానున్న రాష్ట్రాలు ముమ్మర ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌పై పాక్షిక ప్రభావం ఉండనుండడంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కీలక ఇవాళ (బుధవారం) ప్రకటన విడుదల చేసింది. దానా తుపాను రేపటికి వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని, గడిచిన 6 గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో తీరం దిశగా కదిలిందని వెల్లడించింది. ఈ తుపాను గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము లోపు తీరం దాటే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. పూరీ-సాగర్ ద్వీపం మధ్య భితార్కానికా, ధమ్రా (ఒడిశా) సమీపంలో తీరం దాటనుందని పేర్కొంది. ఈ తుపాను ప్రస్తుతానికి పారాదీప్‌కు (ఒడిశా) 520 కిలోమీటర్లు, సాగర్ ద్వీపానికి (పశ్చిమ బెంగాల్) 600 కిలోమీటర్లు, ఖేపుపరాకు (బంగ్లాదేశ్) 610 కిలోమీటర్ల దూరంలో కదులుతోందని వివరించింది. కాగా తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని తీర ప్రాంతం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అప్రమత్తం చేసింది. ఈ రోజు (బుధవారం) మధ్యాహ్నం నుంచి గంటకు 80-100 కి.మీ. వేగంతో వీస్తాయని తెలిపింది. ఇక గురువారం రాత్రి నుంచి 100-110 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దానా తుపాను ప్రభావం నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ప్రజలు కింద సూచించిన జాగ్రత్తలు పాటించాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. ఇవాళ, రేపు సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

## ఎపిపిఎస్సీ చైర్‌పర్సన్‌గా అనూరాధ

### మాజీ ఐపిఎస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



అమరావతి,అక్టోబర్ 23(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా మాజీ ఐపీఎస్ అధికారి అనూరాధను బుధవారం నియమించింది. అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇప్పటి వరకు రాష్ట్రంలో వివిధ హోదాల్లో పని చేశారు. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో అనురాధను నియమిస్తూ సీఎస్ నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా అనురాధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీపీఎస్సీ బాధ్యతల్ని గాడిన పెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ పనిని సమర్థంగా, నిష్పాక్షికంగా నిర్వహించే అధికారుల కోసం జల్లెడ పట్టింది. ఈ మేరకు ఏపీ క్యాడర్‌కు చెందిన అనురాధను నియమించింది. ఏఆర్ అనురాధ ఏపీలో ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా ఆమె పనిచేశారు.ఉమ్మడి ఏపీలో వివిధ జిల్లాలకుగానూ ఎస్పీగా, ఐజీగా పనిచేశారు.

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. అనురాధ నియామకం పట్ల సానుకూలంగా ఉండటంతో ప్రభుత్వం ఆమెనే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారం కోల్పోయాక ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని టీడీపీ అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే ప్రభుత్వం మారినా.. గౌతమ్ సవాంగ్ పదవీ కాలం మరో ఏడాదిపాటు గడువు ఉంది. అయినప్పటికీ ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

## కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం

### జగన్ రెడ్డి పాలనలో మహిళలపై విపరీత దాడులు
### మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా

అమరావతి,అక్టోబర్ 23(ఆర్ఎన్ఎ):ఎన్నికల్లో ఘోరపరాజయంతో పరాభవంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మాలనే ప్రయత్నంలో నోటి కొచ్చిందల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో మహిళలపై జరిగినన్ని దాడులు ఇంకెప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో 2 లక్షలకు పైగా కేసులు నమోదైతే.. వాటిని నిరోధించేందుకు అసలు చర్యలు తీసుకున్నారా అని నిలదీశారు. తన ఇంటి పక్కనే దళిత యువతిపై గ్యాంగ్ రేప్ జరిగితే నిందితుడు వెంకటరెడ్డిని ఐదేళ్ల పాటు అరెస్ట్ చేయకుండా చోద్యం చూసిన జగన్.. శాంతిభద్రతల గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలోనే దళిత మహిళ నాగమ్మపై ఆత్యాచారం జరిగితే జగన్ రెడ్డి కనీసం పట్టించుకున్నారా అని మండిపడ్డారు. జగన్ రెడ్డి తన పాలనలో యువతను గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యానికి అలవాటు చేసి వారిని పెడదారి పట్టించారని విమర్శించారు. ఆ ప్రభావంతోనే సైకోలుగా మారిన మగాళ్లు మహిళలపై దాడులు కొనసాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నేరాలను ఉక్కుపాదంతో అణిచివేస్తోందని స్పష్టం చేశారు. మహిళలపై దాడులు జరిగిన ఘటనల్లో వెనువెంటనే పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా నిందితులను అరెస్ట్ చేసి శిక్షిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు



### ఉచిత ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు
### ఇసుక అక్రమంగా విక్రయిస్తే పిడి యాక్ట్
### కొరత ఉన్న ఐదు జిల్లాలో ఇసుక పాయింట్ల ఏర్పాటు
### విశాఖ శారదాపీఠం భూముల కేటాయింపు రద్దు
### ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
### ఎపి కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు

అమరావతి,అక్టోబర్ 23(ఆర్ఎన్ఎ):దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఎపి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చంద్రబాబు చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఇసుక విధానాన్ని అతిక్రమిస్తే ... పిడి యాక్ట్ పెట్టాలని కూడా ఆదేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పార్థసారథి, అనిత, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర వివరించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీలు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. పూర్తిగా ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత ఇసుకతో వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇసుక కొరత ఉన్న ఐదు జిల్లాలో ప్రత్యామ్నయ్య పాయింట్లు ఏర్పాట్లు చేయనున్నా మని వివరించారు. ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలన్నింటినీ ఈ పోర్టల్ గెజిట్‌లో పొందుపరిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ. 20 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాల కమిటీల్లో ఇదివరకు ఉన్న 15 మంది గల సభ్యుల సంఖ్యను 17 కు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. విశాఖ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతమున్న సీట్లను 25 నుంచి 100 సీట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని పార్థసారథి తెలిపారు. ఇందులో 25 టీచింగ్ పోస్టులకు, 58 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేసిందన్నారు. మంగళగిరిలో 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ మంత్రి వర్గం తెలిపిందని మంత్రి వివరించారు.

## రీ సర్వేలో దిద్దుబాటుకు నవంబర్ 30 లోపల పూర్తి చేయండి


### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23-రీ సర్వేపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దిద్దుబాటు పనులను నవంబర్ 30 లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ.పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం. దాసు అన్ని మండలాల తాసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 211 గ్రామాలలో రీ సర్వే పూర్తయిందని... రీ సర్వేలో భూ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని దిద్దుబాటు పనులను నవంబర్ 30 లోపల పూర్తి చేయాలని మండల తహసీల్దార్లును ఆదేశించారు. రోవర్ తో, భౌతికంగా కొలతలు వేసినా ఒకే విస్తీర్ణం వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించడంతో పాటు విస్తీర్ణంలో సాగు చేసి ఉంటే సంబంధిత పంటలపై కూడా రీసర్వే చేయించాలని తాసిల్దార్లను ఆదేశించారు. జిల్లాలో ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వీటికి సంబంధించి భూ సేకరణ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 544డి, 340సి, 440, 167కె రహదారులకు సంబంధించి రోడ్ల విస్తరణకు అదనపు భూములకు భూ సేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 340సీకి సంబంధించిన 1.98 కిలోమీటర్ల పరిధిలోని 650 మీటర్ల పొడవుగల రోడ్డుకు సంబంధించిన ప్రతిపాదనలు ఎన్ హెచ్ పిడికి పంపినట్లయితే సంబంధిత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు.




## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

### వైసిపి పాలనలో మహిళలకు భరోసా ఇచ్చాం
### దిశ యాప్ అందుబాటులోకి తెచ్చాం
### సహానా కుటుంబాన్నన్ని పరామర్శించిన జగన్



గుంటూరు,అక్టోబర్ 23( ):ప్రేమోన్మాది చేతిలో దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సహాన కుటుంబసభ్యులకు మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన జగన్.. ముందుగా మార్చురీలో సహాన మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సహాన కుటుంబ కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిందన్నారు. ఒక దళిత చెల్లి బలై పోయిందని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలకు భరోసా ఇచ్చామని.. దిశ యాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పుకొచ్చారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులను పంపించే వాళ్లమన్నారు. చేసిన వాడు మన వాడైతే ఏం చేసినా పర్వాలేదు అన్న సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గుంటూరులో దయనీయమైన ఘటన జరిగిందని... ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో చూశామన్నారు. సీఎం చంద్రబా బుతో నిందితుడు దిగిన ఫోటోలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ధర్మం పాటించాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తర్వాత బాధితురాలిని ఆసుపత్రిలో చేర్చారని.. ప్రభుత్వం నుంచి ఎవరూ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేవలం టీడీపీకి చెందిన యువకుడు కావడంతోనే ప్రభుత్వం స్పందించ లేదని విమర్శించారు. రెడ్ బుక్ పాలనలో పోలీసులు నిమగ్నమయ్యారని వ్యాఖ్యలు చేశారు. అత్యాచారాలను అరికట్టలేకపోయారన్నారు. చంద్రబాబు పాలనలోకి వచ్చిన మూడు నెలల్లో 77 మందిపై అత్యాచారాలు జరిగాయని.. ఏడు మంది హత్యకు గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం ఏమైనా పట్టించుకుంటుందా అంటూ మండిపడ్డారు. రెడ్ బుక్ పాలనలో ఏమైనా చేయండి వెనకేసుకొస్తామని చంద్రబాబు అంటున్నారన్నారు. ఫోక్సో కోర్టులు, మహిళా కోర్టులు ఏర్పాటు చేశామని.. దిశ వాహనాలను ఇచ్చామని వెల్లడించారు. పథకాలన్నీ ఎత్తి వేశారని.. మహిళలను మోసం చేశారని మండిపడ్డారు.

# సంపాదకీయం

గురువారం 24-10-2024

## ఇజ్రాయిల్ తరహా పోరాటమే శరణ్యమా

నిరంతరం నిప్పుల మధ్యలో మండే కశ్మీర్‌కు మంచి రోజులు వచ్చాయని అనుకున్నారంతా! 370 ఎత్తేశాం.. అభివృద్ధి చేసేశాం అని చెప్పుకుంది కేంద్రం. పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలొచ్చాయ్ ప్రజాస్వామ్యం బతికిందని సంతోషపడ్డారు చాలా మంది. ఏకంగా, ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే తాజాగా ఉగ్ర దాడులు జరిగాయి. భారతదేశంలో అత్యంత ఉద్రిక్తతల నడుమ నలుగుతున్న ప్రదేశం జమ్మూ కశ్మీర్. రాష్ట్ర హోదా పోయి.. కేంద్ర పాలనలోకి వెళ్లిన కొన్నాళ్ల పాటు ఈ ప్రాంతంలో పరిస్థితులు సద్దుమణిగాయని అంతా అనుకున్నారు. అయితే, చాప కింద నీరులా వ్యాపించిన ఉగ్రవాద చర్యలు మాత్రం ఆగలేదు. ఈ మధ్య కాలంలో అవి మరింత ఊపందుకున్నాయి. గత కొన్ని నెలలుగా కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులు పెరిగాయి. యాంటీ టెర్రర్ ఆపరేషన్లలో వీర జవానులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కశ్మీర్ ఎన్నికలు ప్రశాంతంగానే జరిగినప్పటికీ.. ఎన్నికలు పూర్తయిన పది రోజుల తర్వాత, తాజాగా ఉగ్రవాదులు ఏడుగుర్ని పొట్టన పెట్టుకున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మళ్లీ 1990ల్లో పరిస్థితి చూడాల్సి వస్తుందనే భయం పట్టుకుంది. అందుకే, ఉగ్రమూకల ఉనికిని పూర్తిగా తుడిచేయడానికి భారత్ ఏం చేయాలనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం, మిడిల్ ఈస్ట్‌లో ఉగ్రవాదంపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌లా, భారత్ కూడా మిలిటెన్సీపై యుద్ధం ప్రకటించాలా అనే సందేహాలు కలుగుతున్నాయి.కశ్మీర్‌లో కొత్తగా ఏర్పడిన ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి ఉగ్రవాదులు దాడులతో స్వాగతం పలికినట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు కొంత ఉద్రిక్త పరిస్థితులు చూసినప్పటికీ.. ఎన్నికల ప్రక్రియ సమయంలో అంతా సజావుగానే జరిగింది. ఇక, ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల తర్వాత కశ్మీర్ మళ్లీ ఉలిక్కిపడింది. ఉగ్రమూకలు ఒక్కసారిగా రెచ్చిపోయారు. సామాన్యులే టార్గెట్‌గా జరిగిన ఈ దాడిలో ఉగ్రవాదులు ఏడుగురిని హతమార్చారు. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై టన్నెల్ నిర్మాణ పనుల ప్రాంతంలో ఉన్న ఒక వైద్యుడు, ఐదుగురు స్థానికేతరులను చంపేశారు.అక్టోబర్ 20 సాయంత్రం ఈ ఘటన జరిగింది. గందర్‌బాల్‌లోని గగంగీర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీ క్యాంపు సైట్‌కు సమీపంలో గుర్తుతెలియని సాయుధులు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. పనులు చేస్తున్న స్థానికులు, స్థానికేతర కార్మికులు, ఇతర సిబ్బందిపై ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇందులో ఇద్దరు ఉద్యోగులు అక్కడికక్కడే మృతిచెందగా, ఐదుగురు ఆస్పత్రిలో మరణించారు. మరో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతా ప్రశాంతంగా ఉంటుందని, ప్రజలకు రక్షణ కల్పిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం ప్రకటించిన వారం రోజులకే సామాన్యులపై దాడి జరగడం ఇప్పుడు ఆందోళనను పెంచుతోంది.తాజా ఉగ్రదాడిలో మృతిచెందిన వారిలో బుద్గామ్‌కు చెందిన డాక్టర్ షెహనవాజ్‌తో పాటు కార్మికులు, ఫహీమ్ నజీర్, కలీం, మహ్మద్ హనీఫ్, శశి అబ్రోల్, అనిల్ శుక్లా, గుర్మీత్ సింగ్‌లు ఉన్నారు. అయితే, ఉగ్రదాడిపై సమాచారం అందుకున్న భద్రతా బలగాలు వెంటనే రంగంలోకి దిగాయి. ఘటన స్థలాన్ని చుట్టుముట్టాయి. ఉగ్రవాదుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టాయి. అయితే, దీనికి ముందు, అక్టోబర్ 18న షోపియాన్ ప్రాంతంలో ఉగ్రదాడుల్లో బుల్లెట్ గాయాలతో ఓ బిహార్ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన జరిగిన రెండు రోజులకే మరో ఉగ్రదాడి జరగడంపై సర్వత్రా ఆందోళన నెలకొందికాగా, కశ్మీర్‌లో ఉగ్రదాడిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఉగ్రమూకలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.కాల్పుల ఘటనను జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా.. నిరాయుధ అమాయక ప్రజలపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కశ్మీర్ నుండి ఉగ్రవాదాన్ని తుడిచేయాలని పిలుపునిచ్చారు.జమ్మూకశ్మీర్‌లో, ఇటీవలి కాలంలో, పౌరులే లక్ష్యంగా దాడులు చేసి హతమార్చుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. అయితే, జమ్మూ కశ్మీర్‌లని గాందర్బల్ జిల్లాలో ఉగ్ర దాడులు వెనుక లష్కరే తొయిబా అనుబంధ శాఖ ప్రమేయం ఉన్నట్లు భారత ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంస్థ ఈ ఉగ్రదాడికి పాల్పడినట్లుగా స్థానిక మీడియాల్లో కథనాలు వచ్చాయి. రెసిస్టెన్స్ ఫ్రంట్ చీఫ్ షేక్ సజ్జద్ గుల్ ఈ దాడికి సూత్రధారి అని గుర్తించినట్లు సమాచారం. సజ్జద్ ఆదేశానుసారమే ఉగ్రవాదులు, కశ్మీరేతరుల్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కాగా, కశ్మీరీయేతరులే లక్ష్యంగా ఉగ్రవాదులు జరుపుతున్న ఈ దాడులను భద్రతా బలగాలు సీరియస్‌గా తీసుకున్నాయి. ఉగ్రవాదులను ఏరివేసేందుకు ఘటన జరిగిన ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఉగ్రవాదులు తప్పించుకోకుండా.. డేగకన్నుతో వేట సాగిస్తున్నారు. ఉగ్రమూకలను ఏరివేసేందుకు పకడ్బందీగా ముందుకు కదులుతున్నారు. ఇందుకోసం భారీ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.ఇటీవలి పూంచ్ జిల్లాలోని సూరంకోట్ నుంచి ఉగ్రవాదులను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబరు 18న ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్‌ల ఆధారంగా పూంచ్ సెక్టార్‌లో భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో ఉగ్రవాదులు అబ్దుల్ అజీజ్, మన్వర్ హుస్సేన్ పట్టుబడ్డారు.

# ఖలీద్ సైఫుల్లా జాతీయ కాంగ్రెస్ డేటా,టెక్నాలజీ విభాగం వైస్ చైర్మన్‌గా నియామకం..

## అభినందనలు తెలిపిన డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ..



విభారె న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23..తన ప్రతిభ, కృషికి గుర్తింపుగా,ఏ ఐ సి సి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖలీద్ సైఫుల్లాను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐ ఎన్ సి) డేటా,టెక్నాలజీ విభాగం ఆల్ ఇండియా వైస్ చైర్మన్‌గా ఖలీల్ సైఫుల్లాను నియమించారు.ఖలీద్ సైఫుల్లా కర్నూలులో జన్మించి, కర్నూల్ లోని ఎన్.ఆర్. పేట్ సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీష్ స్కూల్‌లో తన విద్యను పూర్తి చేశారు.ఖలీద్ సైఫుల్లా 20 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన సాఫ్ట్‌వేర్ నిపుణుడు, గూగుల్,ఇన్వెస్కోనెస్, మరియు డెల్ వంటి ప్రముఖ సంస్థల్లో పని చేశారు. డేటా విశ్లేషణ, టెక్నాలజీపై ఆయన నైపుణ్యం విస్తృతంగా గుర్తింపుపొందింది. కాంగ్రెస్‌లో చేరడానికి ముందు, ఖలీద్ సైఫుల్లా సామాజిక సేవకు తన సమర్పణతో గణనీయమైన గుర్తింపు పొందారు. ఆయన రూపొందించిన మిస్సింగ్ ఓటర్ల యాప్, ఉచిత రేషన్ యాప్, ఉచిత ఆక్సిజన్ యాప్ లాంటి అనేక కార్యక్రమాలు ప్రముఖమైన మీడియా అవుట్‌లెట్‌లలో,అనగా సి ఎన్ ఎన్,బి బి సి,ఫారిన్ పాలసీ, బిజినెస్ స్టాండర్డ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మరియు ఎన్ డి టి వి లో ప్రసారమయ్యాయి, వాటి ప్రభావం, ప్రాముఖ్యతను తెలియజేస్తూ.కాంగ్రెస్ పార్టీ కోసం ఖలీద్ సైఫుల్లా అనేక కీలకమైన కార్యక్రమాలను అభివృద్ధి చేశారు, అందులో క్రౌడ్‌ఫండింగ్ ప్లాట్‌ఫారమ్ 'డొనేట్ ఐఎన్‌సి', మేనిఫెస్టో ఐడియా మేనేజ్‌మెంట్ పోర్టల్ 'ఆవాజ్ భారతకి' ఉన్నాయి. ఆయన ఇతర ముఖ్యమైన విజయాల్లో భరత్ జోడో యాత్ర కోసం ఫోటో సెర్చ్ ఏ ఐ సాధనం, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ కోసం మెంబర్షిప్ పోర్టల్‌ను రూపొందించడం ఉన్నాయి. అలాగే ఐ ఎన్ సి డిజిటల్ మెంబర్షిప్ యాప్ యొక్క అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. తన కొత్త నియామకంపై సంతోషం వ్యక్తం చేసిన ఖలీద్ సైఫుల్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, మరియు ఐ ఎన్ సి డేటా అండ్ అనలిటిక్స్ విభాగం చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తికి ధన్యవాదాలు తెలియజేశారు.రాజకీయ నేపథ్యం లేని వారు కూడా ప్రజా సేవ పట్ల ఆసక్తి ఉంటే కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధి సాధించడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తన పదోన్నతి నిరూపిస్తుందని ఆయన అన్నారు."డేటా, టెక్నాలజీని,ముఖ్యంగా జెనరేటివ్ ఏ ఐ వంటి అధునాతన సాధనాలను ఉపయోగించి,కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రతి విభాగం మరియు నాయకులను మద్దతు ఇవ్వడానికి నేను కట్టుబడి ఉన్నాను.నా విస్తృత అనుభవం, స్థిరమైన ప్రదర్శన, కాంగ్రెస్ పట్ల ఉన్న నా గాఢమైన కట్టుబాటు కారణంగా ఈ పాత్రకు నేను తగినవాడిని అని నమ్ముతున్నాను" అని ఖలీద్ సైఫుల్లా అన్నారు.డేటా అండ్ టెక్నాలజీ సెల్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి ట్వీట్ చేస్తూ ఖలీద్ సైఫుల్లా పదోన్నతిని స్వాగతించారు. "నా సహచరుడు ఖలీద్ సైఫుల్లాకు ఐ ఎన్ సి ఇండియా డేటా, టెక్నాలజీ విభాగం వైస్ చైర్మన్ గా పొందిన ఈ పదోన్నతి నిజంగా అర్హమైనదే.ఆయన పార్టీలో చేరిన ఆరు సంవత్సరాల నుండి, ఖలీద్ సైఫుల్లా చేసిన నిష్కల్మషమైన,స్థిరమైన మరియు నిశ్శబ్ద కృషిని నేను చూశాను.ఆయనకు నా శుభాకాంక్షలు, మద్దతు" అని తెలిపారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ ఖలీల్ సైఫుల్ల కి అభినందనలు తెలియజేశారు.కర్నూలు వాసికి ఇలాంటి అరుదైన అవకాశం దొరకడం కర్నూలు జిల్లాకే గర్వకారణమని అభినందించారు.

## అంగన్వాడి వర్కర్.. హెల్పర్ పోస్ట్ లకు దరఖాస్తు గడువు పెంపు.. - ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని తేజేశ్వరి



విభారె న్యూస్ అక్టోబర్ 22 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి వర్కర్ మరియు హెల్పర్ పోస్టుల నియామకానికి అర్హులైన మహిళ అభ్యర్థులు ఈనెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి తేజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులో గలఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల-1 బిసి-డి శిరివెళ్ళ మండలంలోని గుంప్రమాణిదిన్నె-1బి -సిఏ ఎర్రగుడిదిన్నె-1 ఈ- డబ్ల్యూ ఏస్ అంగన్వాడి వర్కర్ పోస్టులు ఖాళీగా ఉండగా , అంగన్వాడి హెల్పర్ పోస్టులు16 కేంద్రాలలో ఖాళీగా ఉన్నాయని సిడిపిఓ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని పేరూరు1 యస్టి పెద్ద కంబలూరు1 ఓసి జనరల్ చిన్న భోదనం1 ఎస్టి, నక్కల దీన్నే1 ఎస్సీ,నేలం పాడు1 ఓసి జనరల్, దొర్నిపాడు5 బిసి బి, ఆలమూరు3 ఓసి జనరల్, దేవరాయపురం 1 ఓసి జనరల్ దేవరాయపురం,2 ఎస్సీ,కేంద్రాలు అహోబిలం3 ఓసి జనరల్, ఆళ్లగడ్డ లో6 బి- సిఏ గుండంపాడు2 ఓసి జనరల్, ఆళ్లగడ్డ4 విహెచ్ (మున్సిపాలిటీ వార్డు)చింతలచెరువు2 ఎస్సీ, వెంకటేశ్వరనగర్ ఎస్టి, రుద్రవరం -2 ఓసి జనరల్ కేంద్రాలలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆమె తెలిపారు. వర్కర్ పోస్టుకు 21 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు నుండి 10వ తరగతి చదివారు మాత్రమే అర్హులని తెలిపారు. వారు తప్పనిసరిగా వివాహితులై స్థానికన్న నివాసం ఉండాల్సి ఉంటుందని సిడిపిఓ తెలిపారు. ఈనెల 21 న దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం ఈనెల 25 వరకు దరఖాస్తు గడువును పొడిగించిందని సిడిపిఓ తేజస్వరి పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పులిమద్ది గ్రామంలో పొగాకు పంట పరిశీలన



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23- నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో బుధవారం నాడు అర్‌ఏ అర్ ఎస్ శాస్త్రవేత్తలు శివ రామకృష్ణ , పొగాకు శాస్త్రవేత్త పులిబాయి పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు .వారు మాట్లాడుతూ అధిక వర్షానికి లోనైనటువంటి పొగాకు ఆకులు వడలిపోయినచో వాటికి నివారణకు 19-19-19 5గ్రా గ్రాములు లీటర్ నీటి కి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పొగాకు నల్ల కాడ తెగులు నివారణకు రిడోమిల్ గోల్డ్ రెండు గ్రాములు లీటర్ నీటి కి పిచికారి చేసుకోవాల్సిందిగా తెలిపారు. కప్ప కన్ను తెగులు నివారణకి డైఫేనకొనజోల్ లేదా ప్రోపీకోనజోల్ 1 ఎమ్ ఎల్ లీటర్ నీటీకి కలిపి పిచికారి చేసుకోవలసిందిగా సూచించారు . శాస్త్రవేత్తలతో పాటు పులిమద్ది గ్రామ రైతులు ,వీఏఏ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## సీయం ను కలిసిన ముస్లిం సంఘాల ప్రతినిధులు

### కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ యాక్ట్ అమెండ్మెంట్ పై తమ అభ్యంతరాలు వివరించిన ప్రతినిధులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23-ఆలిండియా ముస్లిం లా బోర్డు సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, మండలి మాజీ చైర్మన్ షరీఫ్ సహా పార్టీ మైనారిటీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో కలిశారు. వక్ఫ్ యాక్ట్ సవరణపై కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై తమ అభ్యంతరాలు తెలిపారు.కేంద్రం తీసుకువచ్చిన ఈ ప్రతిపాదన వల్ల వక్ఫ్ బోర్డు నిర్వీర్యం అవుతుందని....ఈచర్యముస్లిం వర్గహక్కులు, మనోభావాలు దెబ్బతీస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు తమ అభ్యంతరాలను, ఆందోళనను వివరించారు. వక్ఫ్ చట్టంలో మార్పులను అంగీకరించవద్దని, పార్లమెంట్ లో చట్టాన్ని వ్యతిరేకించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించారు. దీనిపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి ముస్లిం ప్రతినిధులకు తెలిపారు

## దేశం ఎల్లప్పుడూ శివసేన సెంచరీ కొట్టాలనే కోరుకుంటుంది : ఎంపీ సంజయ్ రౌత్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (ఉబ) వందకుపైగా స్థానాల్లో పోటీ చేయాలనుకుంటోందా..?' అని మీడియా ప్రశ్నించగా.. రౌత్ ఆసక్తికరంగా క్రికెట్ పరిభాషలో సమాధానం ఇచ్చారు. 'దేశం ఎప్పుడూ శివసేన సెంచరీ కొట్టాలనే కోరుకుంటుంది' అని చెప్పారు. తమకు అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టే సత్తా ఉన్నదని, కొట్టి తీరుతామని అన్నారు. ముంబైలో క్రికెట్ ఆడటం, చూడటం బాగానే జరిగిందని, క్రికెట్‌లో సంచరీకి చాలా ప్రాముఖ్యం ఉంటుందని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. శివసేన ఎన్సీపీ , కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహా వికాస్ అఘాడీ లో సీట్ల పంపకంపై పీఠముడి వీడటం లేదనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రౌత్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మహా వికాస్ అఘాడీలో సీట్ల పంపకంపై ఇంకా మంతనాలు జరుగుతున్నాయి. శివసేన అధిక సీట్లు డిమాండ్ చేస్తుండగా అందుకు కూటమి



నేతలు ఒప్పుకోవడం లేదని తెలిసింది.మరోవైపు మంగళవారం శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే, ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అంటే ఉద్ధవ్ శివసేన కూడా అధికార మహాయుతి కూటమితో కలువబోతున్నదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ కొందరు రాజకీయ విశ్లేషకులు మాత్రం సీట్ల విషయంలో తన పంతం నెగ్గించుకోవడం కోసమే ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన నేతలు ఈ విధమైన లీకులు ఇస్తున్నారని చెబుతున్నారు.

# గుర్లలో ఏం జరిగింది

విజయనగరం, అక్టోబరు 23,ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏదైనా కొద్ది రోజుల పాటు గత ప్రభుత్వంపై నెపం వేయవచ్చు. ఎందుకంటే గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఈ సమస్య తలెత్తిందని చెప్పి నమ్మించవచ్చు. ప్రజలు కూడా దానిని విశ్వసిస్తారు. కానీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అయిన తర్వాత కూడా ఏర్పడుతున్న సమస్యలకు గత ప్రభుత్వమే కారణమని చెబుతూ తప్పించుకోవడానికి ఈ ప్రభుత్వం చూస్తే ప్రజలు ప్రస్తుతం సైలెంట్ గా చూస్తుండ వచ్చు. వినవచ్చు. అంతే తప్ప సరైన సమయంలో ఇలా ఆరోపణలు చేసే వారికి తగిన రీతిలో గుణపాఠం ప్రజలు చెబుతారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతుంది. ఐదో నెలలోకి కొత్త ప్రభుత్వం ప్రవేశిస్తుంది.. అయినా సరే విజయనగరం జిల్లాలో అతి సార వ్యాధి సోకి ఎనిమిది మంది మృతి చెందారు. అక్కడ తాగునీటి తాగినందువల్లనే ప్రజలు మృత్యువాత పడ్డారు. అనేక మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ మరణాలకు కారణం బాధ్యులు ఎవరని ప్రశ్నించడం కంటే వెంటనే అక్కడ చర్యలు ప్రారంభించడం, మరణాలకు కారణాలు కనుగొనడం, వ్యాధి ప్రబలకుండా అత్యవసర చర్యలు తీసుకోవడం, డయేరియాతో బాధపడుతున్న వారిని అవసరమైతే విశాఖ వంటి ప్రాంతాలకు తరలించి మెరుగైన చికిత్స వంటివి చేయాల్సి ఉంటుంది. అక్కడ బోర్లు, మంచినీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా గొర్ల గ్రామంలో ఎనిమిది మంది కలుషిత నీటిని తాగి ఎనిమిది మంది మరణించడం వెనక గత వైసీపీ ప్రభుత్వమే కారణమని నేటి పాలకులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో మంచినీటి పైపులను బాగు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మరి ఐదు నెలలు వచ్చిన ఈ ప్రభుత్వం ఏం చేసినట్లో మాత్రం చెప్పలేదు. తప్పిదాన్ని గత ప్రభుత్వం పై నెడితే సరిపోతుందా? అన్న ప్రశ్నకు మాత్రం వారి వద్ద సరైన సమాధానం లేదు. రక్షిత మంచినీటి సరఫరా బదులు కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోని అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? పవన్ కల్యాణ్ పర్యటించి... అదే సమయంలో గొర్ల గ్రామంలో పవన్ కల్యాణ్ పర్యటించారు. బాధితులను పరామర్శించారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ కూడా గత ప్రభుత్వంపైనే నిందను మోపే ప్రయత్నం చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం ఐదేళ్లు పాలన చేసింది. ఈ ఐదేళ్లు జరగని ఈ కలుషిత నీటి సరఫరా ఇప్పుడే ఎందుకు ప్రజల గొంతులోకి దిగింది? అన్నది మాత్రం చెప్పలేకపోతున్నారు. బాధిత ప్రాంతంలో పర్యటించేది మంచిదే. దానిని ఎవరూ కాదనరు. అదే సమయంలో అధికారులతో సమీక్ష చేయడం కూడా మంచిదే కానీ అసలు కారణాలను వెతకకుండా వెనక్కు వెళ్లి విమర్శలు చేయడం ఎవరికీ తగదన్న సూచనలు వినిపిస్తున్నాయి.

# గ్రాఫ్ పెంచుకొనేది ఎలా

నెల్లూరు, అక్టోబరు 23, ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. ఎవరు అధికారంలో ఉంటే వారి ఆలోచనలు, స్కీంలు దేశం మొత్తం అనుసరిస్తాయన్న ప్రచారం చేసుకుంటారు. అంతా చేసినా ఎన్నికల సమయం వచ్చేసరికి చతికలపడిపోతుంటారు. గత కొన్ని ఎన్నికల్లో జరుగుతున్న తంతు ఇదే కావడంతో ఈ ప్రచారాలను పెద్దగా నమ్మవద్దంటూ రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ కు భిన్నమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడ అధికార పార్టీపై ప్రశంసలు తప్ప. విమర్శలు బహిరంగంగా ఉండవు. అది చంద్రబాబు అయినా, జగన్ అయినా ఒక్కటే. పాలన సూపర్ అంటూ తెగపొగిడేసే బ్యాచ్ ఒకటి సిద్ధంగా ఉంటుంది నాలుగు నెలల నుంచి ఏం చేశారు? నాడు జగన్ పై ప్రశంసలు... వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాలంటీర్ల వ్యవస్థను, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని ఊదరగొట్టారు. ఆర్బీకే సెంటర్లను కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి అధ్యయనం చేసి వెళ్లారంటూ వార్తలు హల్ చల్ చేశాయి. ఇక జగన్ అమలుచేసిన సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన పరిస్థితులు రావచ్చంటూ ఊహాగానాలు కూడా పెద్దయెత్తున చెలరేగాయి. జగన్ ఇమేజ్ ను అమాంతం అటు జాతీయ మీడియాతో పాటు పార్టీకి అనుబంధంగా ఉండే ప్రాంతీయ న్యూస్ ఛానెళ్ల దగ్గర నుంచి పత్రికలు వరకూ తెగ పొగడ్తలతో ముంచెత్తాయి.ఇంత చేసిన జగన్ పార్టీ చివరకు మాత్రం11 సీట్లకు మాత్రమే పరిమితమయింది.. ఇప్పుడు అదే తెలంగాణకు చంద్రబాబుపై పొగడ్తలు... ఇప్పుడు చంద్రబాబుకు కూడా దాదాపు అదే పరిస్థితి జరుగుతుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ప్రతిరోజూ చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడమే పనిగా పెట్టుకున్నాయి కొన్ని సామాజిక మాధ్యమాలు. జనం అవస్థలు మాత్రం పట్టించుకోకుండా అమరావతి ఇక పూర్తయినట్లేనన్న కథనాలు ప్రచురితమవుతున్నాయి. అదే సమయంలో చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలు దేశం అవలంబిస్తుందని కూడా తెగ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు మిగిలిన రాష్ట్రాల్లో అమలవుతున్నప్పటికీ ఇక్కడ అధ్యయనం చేయుడానికి పొరుగు రాష్ట్రాలు వస్తున్నాయంటూ కథనాలు వండి వార్చేస్తున్నారు.కానీ ఎన్నికల సమయానికి మాత్రం ఎవరు ఏం చేసినా ఫలితాలు మాత్రం జనం తేలుస్తారు. ఈ పథకాలు, ఈ సంక్షేమం అనేది జనం విశ్వసించరు. వారికి ఏది కావాలో అది తేలుస్తారు. ఏ రాష్ట్రమైనా అంతే. వాగ్దానాలు చేసినా, హామీలు ఇచ్చినా దానిని నమ్మేవారు కొద్ది శాతం మాత్రమే ఉంటారని గత ఎన్నికల ఫలితాలను బట్టి అర్ధమవుతుంది. సంక్షేమ పథకాలను అమలు చేసిన జగన్ కు 40 శాతం ఓట్లు వస్తే, చంద్రబాబు కూటమిలోని మూడు పార్టీలకు కలిపి అరవైశాతం ఓట్లు వచ్చాయి. అంటే జనం దేనిని నమ్ముతారో? వేటిని విశ్వసిస్తారన్నది ఎన్నికల సమయంలోనే తప్ప మిగిలిన రోజుల్లో బాకాలు ఊదినా ప్రయోజనం ఉండదన్న విషయం అర్థమయితే చాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఏపీ ప్రజల మూడ్ ను అంచనా వేయడం కష్టమేనన్నది వారి అభిప్రాయంగా ఉంది.

**పురుగుల మందు కొనిచ్చిన ప్రియుడు.. తాగి ఆత్మహత్య చేసుకున్న ప్రియురాలు**

ఆ యువకుడే తన సర్వస్వం అనుకుంది ఆ అమ్మాయి.. తనతోనే నూరేళ్ల జీవితం గడపాలని ఆశపడింది. కానీ ఆ అబ్బాయి మాత్రం అవసరాలను తప్ప ఆమెలోని ప్రేమను గుర్తించలేదు. తన కోరిక తీరగానే వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఇదేంటని ప్రశ్నిస్తే ముఖం చాటేశాడు. నువ్వు లేకుండా నేను బతకలేనని చెబితే.. ఛస్తే చావమని పురుగుల మందు కొనిచ్చాడు.. ఇన్నాళ్లూ తన వాడు అనుకునే వాడే చావమనడంతో ఆ బాధతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లాలోని యు.కొత్తపల్లికి చెందిన ఉమామహేశ్వరరావుకు కాకినాడ గొడారి గుంటకు చెందిన యువతి (24)తో ఏడేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. 2017లో వీరిద్దరికి పరిచయమవ్వగా.. కొంతకాలానికే ఇద్దరూ ప్రేమగా మారింది.

# ఫ్రీ గ్యాస్ కోసం... ఇవాళ్టి నుంచి బుకింగ్



కాకినాడ, అక్టోబరు 23, ఏపీ ప్రభుత్వం దీపావళికి 'దీపం పథకం' ప్రారంభిస్తుంది. ఈ పథకం కింద మహిళలకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తుంది. అక్టోబర్ 24 నుంచి బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. పీఎం ఉజ్వల యోజన పథకం లబ్దిదారులకు ఈ స్కీమ్ ద్వారా సిలిండర్లు అందిస్తారు. 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దీపావళి నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై సీఎం నారా చంద్రబాబునాయుడు ఇవాళ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీపం పథకం ఏపీ చరిత్రలో గొప్ప మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఆడ పడుచులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గమని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి 4 నెలల వ్యవధిలో అర్హులైన కుటుంబాలకు మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి, అర్హత గల ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు.అక్టోబర్ 24 నుంచి బుకింగ్దీపావళి(అక్టోబర్ 31) నుంచి ఉచిత సిలిండర్ల పథకం ప్రారంభమవుతుంది. అయితే అక్టోబర్ 24 నుంచే సిలిండర్లను బుకింగ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభం అవుతుంది. లబ్దిదారులు ముందుగా నగదు చెల్లి గ్యాస్ సిలిండర్ తీసుకోవాలి. 2 రోజుల వ్యవధిలో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీని జమ చేస్తారు. మహిళలకు ఇంటి ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంతో గతంలో దీపం పథకం తెచ్చామని, ఇప్పుడు మళ్లీ ఉచిత సిలిండర్ల పథకం అమలుచేస్తున్నామన్నారు.దీపావళి రోజునే దీపం పథకానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన వారికి దీపం పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించనున్నారు. ఈ పథకం అమలుతో ఏపీ ప్రభుత్వంపై ఏటా రూ.2,684 కోట్ల భారం పడనుంది. పీఎం ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన వారికి మాత్రమే దీపం పథకంలో 3 సిలిండర్లు ఉచితంగా అందించనున్నారు. మిగతా వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అయితే ఉజ్వల యోజన లబ్దిదారులకు దీపం పథకం సులభంగా వర్తిస్తుందన్నారు.అర్హతలు దీపం పథకం కింద ఉచిత సిలిండర్లు పొందేందుకు తగిన అర్హతలను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.లబ్దిదారులు ఆంధ్రప్రదేశ్ పౌరులై ఉండాలి.తెల్లరేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటారు.గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలి.బీపీఎల్ కుటుంబాలు మాత్రమే అర్హులుఅవసరమయ్యే పత్రాలుఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు లబ్దిదారుల ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, మొబైల్ నంబర్, కరెంట్ బిల్లు, స్థానికత సర్టిఫికెట్ అవసరం. దీపం పథకం కింద 3 సిలిండర్ల కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అధికారులు సూచించిన విధంగా లబ్దిదారుల పేరు, చిరుమానా నమోదు చేయాలి. ఇతర డాక్యుమెంట్స్ ఫొటోలు ఆన్ లైన్ లో అప్లోడ్ చేయాలి. దరఖాస్తుదారులు వివరాలను పరిశీలించి, అర్హులకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తారు.

# నారా లోకేష్ ఢిల్లీ మంత్రాంగం వెనుక రాజకీయం

విజయవాడ, అక్టోబరు 23, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి నారా లోకేష్ తరచూ ఢిల్లీ వెళ్తునారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో ముఖ్యంగా అమిత్ షాతో తరచూ సమావేశం అవుతున్నారు. మీడియాకు తెలిసే ఆయన నాలుగైదు సార్లు సమావేశం అయ్యారని.. మీడియాకు తెలియకుండా ఇంకా చాలా సార్లు చర్చలు జరిపారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కానీ అమిత్ షాతో దాదాపుగా గంటసేపు చర్చించినట్లుగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో అందరూ ఆశ్చర్యపోయారు. నారా లోకేష్ అధికారక సమవేశాల కోసం ఢిల్లీ వెళ్లారు. కానీ అధికారిక సమావేశాలు ఉన్నది సోమవారం.. ఆదివారం ఆయన అమిత్ షాతో సమావేశమయ్యారు.ఈ సమావేశ ఎజెండా ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులేనని చెబుతున్నారు. కానీ అది పూర్తిగా రాజకీయ సమావేశం అన్న అభిప్రాయం కూడా ఉంది. చంద్రబాబునాయుడు పరిపాలన చూసుకుంటూంటే రాజకీయంగా నారా లోకేష్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీ వ్యవహారాలను ఆయనే చూసుకుంటున్నారు. ముఖ్యంగా రెడ్ బుక్ అమలు తన బాధ్యత అని నారా లోకేష్ చెబుతున్నారు. మద్యం స్కాంతో పాటు గనుల స్కాంలు ఇతర అవకతవకల విషయంలో జరిగిన చర్యలు తీసుకునే విషయంలో లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని అంటున్నారు. రెడ్ బుక్ అమలును చట్టబద్దంగా చేయాలని నారా లోకేష్ అనుకుంటున్నారు. అందులో భాగంగా ఎప్పటికప్పుడు ఏపీలో జరిగిన అవకతవకలు,స్కాములు, మనీలాండరింగ్ వంటి అంశాలపై సాక్ష్యాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి నివేదిస్తున్నరని చెబుతున్నారు. వారి నుంచి వచ్చే సూచనల ఆధారంగానే చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు. ఏపీలో మద్యం స్కాం అన్నింటికన్నా భారీగా జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సీఐడీ విచారణకు ఆదేశించారు. అంతర్గతంగా విచారణ జరుగుతోంది. డబ్బులు ఎక్కడి నుంచి ఎవరికి చేరాయి.. ఎలా మనీలాండరింగ్ జరిగింది అన్న వివరాలను కూడా సీఐడీ కనిపెట్టిందని.. ఒకే సారి ఈడీని కూడా రంగంలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు.ఈ వ్యవహారాలతో పాటు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, నామినేటెడ్ పోస్టులు వంటి వాటిపైనా బీజేపీ పెద్దలతో నారా లోకేషే మాట్లాడుతున్నారని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నిధులు.. జాతీయ రాజకీయాల అంశాలను చంద్రబాబు చూసుకంటూ ఉంటే.. పూర్తిగా రాష్ట్ర రాజకీయ అంశాలను నారా లోకేష్ టేకోవర్ చేశారని చెబుతున్నారు. ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా ఉండేందుకు స్వయంగా కొన్ని ముఖ్యమైన అంశాలను బీజేప పెద్దలకు చెబుతున్నట్లుగా తెలుస్తోంది. చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు నారా లోకేష్ ఢిల్లీలో కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలోనే నారా లోకేష్ అందరికీ బాగా పరిచయమున్న నేత అయ్యారు.

# లోయలో పడిన ఆర్టీసీ బస్సు

పులివెందుల,వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు కదిరి నుంచి పులివెందులకు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది

# వైసీపీ నేతలకు సన్ స్ట్రోక్స్ తప్పవా....

అమరావతి, అక్టోబరు 23, ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ పొలిటీషియన్లకు వరుసగా సన్‌స్ట్రోక్‌లు తగులుతున్నాయి. కొడుకులను వమ రాజకీయ వారసుల్ని చేద్దామంటున్న లీడర్లకు వారి కారణంగా అసలు రాజకీయ భవిష్యత్తు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. గత ఎన్నికల్లో కొందరు వైసీపీ నేతలు వారసుల్ని ఎన్నికల బరిలో దింపి చేతులు కాల్చుకున్నారు. ఆ పుత్రరత్నాల నిర్వాకాల కారణంగా ఆ కుటుంబ రాజకీయ భవిష్యత్తే అగమ్యగోచరంగా మారుతుందంటున్నారు. ఏపీలో గత ఎన్నికల్లో పలువురు వైసీపీ నేతలకు సన్ స్ట్రోక్ గట్టిగానే తగలింది. ఎన్నికల తర్వాత కూడా సదరు పుత్ర రత్నాల నిర్వాకాలతో ఇంకొందరు సీనియర్ నేతల పొలిటికల్ ఫ్యూచర్ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడింది. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, పాల్పడిన అక్రమాలకు సంబంధించి ఇప్పుడు విచారణలు ఎదుర్కొంటున్నారు. తండ్రుల అండ చూసుకుని గత అయిదేళ్లలో చెలరేగిపోయిన వారసులుగా వచ్చిన తనయులను కూడా వెంటాడుతున్న కేసులు.. తమ రాజకీయ భవిష్యత్‌ను కుమారులు ముందుకు తీసుకువెళ్తారని అనుకుంటున్న తరుణంలో వారు కేసుల్లో ఇరుక్కుంటూ ఉండటంతో సదరు సీనియర్ నేతల్లో పొలిటికల్ ఫ్యూచర్‌పై బెంగ కనిపిస్తుంది.ఓ వైపు కేసులు, మరోవైపు రాజకీయ భవిష్యత్‌పై ఆందోళనలతో నేతలు తల్లడిల్లిపోవాల్సి వస్తుందట. పార్టీకి కూడా వారసుల వ్యవహారం తలనొప్పిగా మారుతుందంట. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ వారసుడు వైసీపీ నేత శ్రీకాంత్ తాజాగా మర్డర్ కేసులో అరెస్ట్ అయ్యారు. దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని మధురైలో శ్రీకాంత్‌ని అరెస్ట్ చేసిన పోలీసులు ఆంధ్రప్రదేశ్‌కి తీసుకొచ్చారు.మరోవైపు తన కొడుకు శ్రీకాంత్ అరెస్టును మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తీవ్రంగా ఖండిస్తున్నారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రోద్బలంతోనే పోలీసులు తన కొడుకును అరెస్ట్ చేశారని ఆరోపించారు. తమ రాజకీయ జీవితాన్ని అప్రతిష్ట పాలు చేయాలన్న ఉద్దేశంతోనే సుభాష్.. తన కొడుకుని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. ఆయన ఆరోపణల సంగతేమో కాని 20 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న విశ్వరూప్ కెరీర్ చరమాంకంలో ఉన్నారు. కాంగ్రెస్‌తో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి వైసీపీలోకి వచ్చిన ఆయన వైఎస్ నుంచి జగన్ వరకు నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేశారు.ఇక పొలిటికల్ రిటైర్ మెంట్ తీసుకుందామని భావించి మొన్నటి ఎన్నికల్లో తన కుమారుడు శ్రీకాంత్‌ను అమలాపురం ఎమ్మెల్యేగా పోటీ చేయించాలని చూశారు. అయితే జగన్ ఒప్పుకోకపోవడంతో తానే మరోసారి బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు. వచ్చే ఎన్నికల్లో తన కొడుకుని రాజకీయ అరంగేట్రం చేయించాలని భావిస్తున్న విశ్వరూప్‌కు వైద్యుడైన శ్రీకాంత్ దళిత యువకుడి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఇరుక్కుని కోలుకోలేని షాక్ ఇచ్చారు.మరో వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేశ్ పరిస్థితి అలాగే తయారైంది. 2009లో కాంగ్రెస్ నుంచి పెడన ఎమ్మెల్యేగా మొదటి సారి గెలిచిన జోగి రమేష్ 2014లో మైలవరం షిఫ్ట్ అయి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో తిరిగి పెడన నుంచి గెలిచిన ఆయనకు జగన్ మంత్రి పదవి కూడా కట్ట బెట్టారు. ఇక మొన్నటి ఎన్నికల్లో పెనమలూరు నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి దారుణ పరాజయం మూట గట్టుకున్నారు. పాపం ఆయన కూడా వచ్చే ఎన్నికల నాటికి తన రాజకీయ వారసత్వాన్ని



కొనసాగించడానికి కొడుకు రాజీవ్‌కు బాధ్యతలు అప్పగించాలని భావించారంటఅయితే అధికారంలో ఉన్నప్పుడు జోగి రమేశ్ చేసిన అక్రమాలు జోగి రాజీవ్‌ని వెంటాడం మొదలుపెట్టాయి . విజయవాడకు చెందిన అగ్రిగోల్డ్ సంస్థ భూములు సీఐడీ అటాచ్‌మెంట్లో ఉన్నాయి . ఇలా అటాచ్ చేసిన భూములను నిబంధనలకు విరుద్ధంగా జోగి రమేశ్ కుటుంబం సొంతం చేసుకుంది అనేది ఆరోపణ. ఆ భూములు రాజీవ్ పేరిట రిజిస్టర్ అయిఉండటంతో సీఐడీ అరెస్ట్ చేసింది. ఈ కేసులో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడి కుటుంబ ఆస్తులు పెంచుకోవడానికి కుట్ర పన్నిన జోగు రమేష్ కూడా అరెస్ట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే చంద్రబాబు నివాసంపై దాడి కేసులో జోగి రమేష్ పోలీసలు విచారణలు ఎదుర్కొంటూ.. బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించి ఉన్నారు. మరి ఆ తండ్రి కొడుకుల పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉంటుందో చూడాలి.మరో మాజీ మంత్రి పేర్ని నానికి కూడా సన్ స్ట్రోక్ తగులుతూనే ఉంది. పేర్నా నాని గత ఎన్నికల్లో తాను మచిలీపట్నం ఎమ్మెల్యేగా పోటీ నుంచి తప్పుకుని తనయుడు పేర్ని కిట్టూని బరిలోకి దింపారు . అయితే 2019లో తన తండ్రి 4 వేల ఓట్ల తేడాతో గెలిచిన చోట పేర్ని కిట్టూ ఏకంగా 50 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలై తండ్రికి షాక్ ఇచ్చారు. ఎన్నికల టైంలోనే పేర్ని వారసుడిపై పోలీసుల విధులకు అటంకం కలిగించారని కేసులు నమోదయ్యాయి. ఇక రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన గుడ్లవల్లేరు కాలేజీ వ్యవహారంలో కిట్టుపై ఆరోపణలు వచ్చాయి. కాలేజీలో హిడెన్ కెమెరాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసింది కిట్టునే అన్న ప్రచారం ఉంది. విచారణ పూర్తైతే కిట్టూ బుక్ అవ్వడం ఖాయ మంటు న్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిలు కూడా వారసుల కోసం గత ఎన్నికల్లో త్యాగాలు చేశారు.. తాము పోటీ నుంచి తప్పుకుని కొడుకులకు టికెట్లు ఇప్పించుకున్నారు. అయితే ఆ వారసులిద్దరు తొలి అటెంప్ట్‌లో సక్సెస్ కాలేక పోయారు. ఇక ఆ రెండు నియోజకవర్గాల్లో దొంగ ఓట్ల నమోదుకు సంబంధించి ఆరోపణ లున్నాయి . దానిపై జరుగుతున్న విచారణలో నిజాలు నిగ్గ తేలితే వారసులతో పాటు తండ్రులు కూడా కేసుల్లో ఇరుక్కునే పరిస్థితి కనిపిస్తుంది.. మరోవైపు చెవిరెడి కుమారుడు మోహిత్‌రెడ్డి ఇప్పటికే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో నిందితుడుగా ఉన్నాడు. అటు భూమన కూడా టీటీడీలో అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆ క్రమంలో చెవిరెడ్డి ,భూమన ఫ్యామిలీల పొలిటికల్ ఫ్యూచర్ చర్చల్లో నలుగుతుంది.

# విద్యాశాఖకు భారీ మార్పులు...

గుంటూరు, అక్టోబరు 23, ఏపీ విద్యా శాఖలో భారీ మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. విద్యాశాఖలో భారీగా ఉన్నతాధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. వివిధ విభాగాల డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతో పాటు సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో పని చేస్తున్న కార్యదర్శులను సైతం మార్చేందుకు నిర్ణయించారు.మరోవైపు ఉపాధ్యాయ బదిలీలు ప్రక్రియ మాత్రం నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం, ఇంకా ఆ ప్రక్రియను చేపట్టలేదు. ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం అడుగు కూడా ముందుకు వేయలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఆందోళనలను ప్రారంభించాయి.కానీ వివిధ విభాగాల డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతో పాటు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులను బదిలీకి రంగం సిద్ధం చేసింది.

## భూ సమస్యల పరిష్కరించడానికే సదస్సులు



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23-భూ సమస్యలు పరిష్కరించడానికి రీసర్వే జరిగిన గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తాసిల్దార్ కామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బుధవారం బొల్లవరం గ్రామంలో రెవెన్యూ సిబ్బందిచే సదస్సు నిర్వహించి రైతుల నుండి భూసర్వేలోజరిగినమార్పులు చేర్పులకు సంబంధించిన సవరణలు చేయడానికి దరఖాస్తులు స్వీకరించారు . మండలంలోని6గ్రామాల్లోరీసర్వే నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈనెల 24న గోపవరం 25న మసీదుపురం 26 నంది పల్లె 29న తిమ్మాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లుతెలిపారు. ఈ సర్వేలో జరిగిన కొన్ని మార్పులు చేర్పులకుసంబంధించి వాటిని సవరించడానికి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు. మండల సర్వేయర్ బాషా వీఆర్వో మాధవరావుచలమయ్య, నరసింహులు సర్వేయర్ ల తోపాటు మండల టిడిపి అధ్యక్షులు ఉల్లి మధు గ్రామ నాయకులు కిలారి వెంకటేశ్వర్లు ఇతర గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రతి నిత్యం లీకులే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23--నంద్యాల పట్టణంలో ప్రతి నిత్యం లీకులేనని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఎస్ బీ ఐ కాలనీ లో గత నెలలో ఇదే చోట పైప్ లైన్ లీక్ కావడంతో దాన్ని సరిచేసారు. ఇప్పుడు అదే చోట పైపులు లీకేజీ కావడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సక్రమంగా లీక్ లను సరిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సురక్షిత నీరు కరవైంది. కలుషిత నీరు ప్రజల ప్రాణాలను తోడేస్తోంది. తుప్పుపట్టిన తాగునీటి పైపులు ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. గత ఏడాది నూనెపల్లె లో కలుషిత నీరు తాగి ఆసుపత్రి పాలయ్యారు. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గురువారం అష్టమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి అనఘాష్టమి వ్రతం..



విభారె న్యూస్ అక్టోబర్ 23 కర్నూలు జిల్లా ప్రతినిధి..నేడు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు అనఘాష్టమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి వ్రతం నిర్వహించబడును.ఈ వ్రతం చేసుకోవడం వల్ల గురు బలం పెరుగుతుంది ఉద్యోగము,వివాహము లో ఆటంకాలు తొలుగుతాయి,విద్య బుద్ధులు కలుగుతాయి, వైవాహిక జీవితంలో సమస్యలు తొలగిపోయి, సకల కష్టాల నుండి విముక్తి పొంది స్వామివారి అనుగ్రహం కలుగుతుంది. అలాగే శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి దత్త ఫలం భక్తాదులు కట్టుకొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహమును పొందగల రని కోరుకుంటున్నాము. అనఘాష్టమి వ్రతం ప్రధానముగా -1116/-సామూహి కంగా -200/-సంకల్పం -116/-సంప్రదించండి :-7995202082 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

# పాణ్యం డిప్యూటీ తహసీల్దారుపై చర్యలు తీసుకోండి




--- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23-నంద్యాల జిల్లా పాణ్యం డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేసిన మల్లికార్జున్ రెడ్డి పిన్నాపురం భూములలో వేల కోట్ల రూపాయలు మధ్యవర్తి గా వ్యవహరించి భూమి రికార్డు లేని వారికి భూమి రికార్డులు సృష్టించి బినామీ పేర్ల మీద అవినీతి సంపాదన పై సిబిసిఐడి విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.నంద్యాల జిల్లాలో కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో. డక్కా రవికుమార్ అవినీతిపై కోర్టు ఆదేశాల మేరకు సస్పెండ్ చేసి సిబిసిఐ డితో విచారణ జరిపించాలని వచ్చిన తీర్పును స్వాగతిస్తూ పాణ్యం మండలంలో పిన్నాపురం తదితర గ్రామాలలో గ్రీన్ కో సంస్థకు బ్రోకర్ల గా పనిచేసి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తొత్తుగా వుంటూ భూమి రికార్డులు లేని వారికి భూమి రికార్డులు సృష్టించి బినామీ పేర్లతో అవినీతికి పాల్పడుతూ రైతు ల దగ్గర నుండి అతి తక్కువ రేటుకు భూములు కొనుగోలు చేయడంలో ప్రధాన పాత్ర వహించి వేల కోట్ల రూపాయలు సంపాదించిన అప్పటి పాణ్యం డిప్యూటీ ఎమ్మార్వో మల్లికార్జున్ రెడ్డి పై కూడా సిబి సిఐడి విచారణ జరిపించి కొల్లగొట్టిన ప్రజాధనాన్ని ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.జిల్లా లో ఇలాంటి ఆవినీతి అధికారులు పదుల సంఖ్యలో వున్నారని జిల్లా కలెక్టర్ అటువంటి వారిని గుర్తించి వారిపై శాఖపరమైన. చట్టపరమైన చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి అవినీతి తిమింగాలలను అదుపు పెట్టకపోతే ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి అండగా సిపిఐ పార్టీ ముందుండి అవినీతి అధికారులకు భరతం పడతామని నాయకులు హెచ్చరించారు.


## టౌన్ హాల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 23-నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాలును జిల్లా కలెక్టర్ జి. రాజుకుమారి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. పట్టణ నడి మధ్యన విశాలంగా ఉన్న మున్సిపల్ టౌన్ హాల్ ను ఎందుకు నిరుపయోగంగా ఉంచారని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. మునిసిపల్ టౌన్ హాల్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. టౌన్ హాల్ లో డయాస్, సీటింగ్ అరేం జ్మెంట్, లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర మరమ్మతులు ఏమైనా ఉంటే వివరాలు ఇవ్వాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

### ఆలోచింపజేసిన విద్యార్థుల ఎగ్జిబిట్లు ప్రశ్నించే తత్వంతోనే కొత్త ఆవిష్కరణలు









విభారే న్యూస్. అక్టోబర 23కర్నూలు ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ ప్రదర్శన పోటీల్లో కర్నూలు,నంద్యాల జిల్లాలోని 15 గురుకుల పాఠశాల నుండి జూనియర్స్, సీనియర్స్ విభాగాల నుండి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాయలసీమ యూనివర్సి టీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సివి కృష్ణారెడ్డి, డిస్టిక్ కోఆర్డినేటర్ శ్రీదేవి, కర్నూలు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, డాక్టర్ శరత్ చంద్ర, దిన్నేదేవరపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అరుణ కుమారి, సి బెలగల్ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులురూపొందించి ప్రదర్శించిన 150 ఆవిష్కరణలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయి. ఉమన్ ప్రొటెక్షన్ సిస్టం ద్వారా మహిళలు ఎలా రక్షణ పొందవచ్చో సూచిస్తూ చిన్నటేకూరు గురుకుల పాఠశాల విద్యార్థులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుం ది. స్మార్ట్ గ్లాస్, డ్రోన్, క్రేన్లు, స్మార్ట్ బ్రిడ్జి, రోబో, ఏటీఎం, గ్రీన్ హైడ్రోజన్, చిత్రలేఖనం, తదితర ప్రాజెక్టులు విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాయలసీమ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ సివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్ విద్యార్థులకు ప్రశ్నించే తత్వంతోనే సమాధానం లభిస్తుందన్నారు. సైన్స్ లో ఎక్కువగా ప్రశ్నించడం ద్వారానే కొత్త వాటిని ఎక్కువగా కనుగొన్నారని తెలిపారు. విద్యార్థుల నమూనాలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయన్నారు. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శ్రీదేవి మాట్లాడుతూ నాలుగు థీమ్ లలో విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించామన్నారు.ఇవి కాకుండా ఆర్ట్స్, డ్రాయింగ్ లోను పోటీలు జరిగాయన్నారు, అందులో సీనియర్స్ విభాగంలో 8 జూనియర్స్ విభాగంలో 8 మంది, 16 మందిని విజేతలుగా ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 28,29తేదీల్లోడోన్‌లో జరగనున్న జోనల్ స్థాయి పోటీలలో వారు పాల్గొంటారని తెలిపారు

## పట్టణ పరిశుభ్రతలో భాగ్యస్వాములు కండి-మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి..



విభారె న్యూస్ అక్టోబర్ 23 ఎమ్మిగనూరు. శాసనసభ్యులు జయనాగేశ్వర రెడ్డి సూచనల మేరకు ఎమ్మినూర్ పురపాలక సంఘ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాలనుసారం బుధవారం రోజు ఎమ్మిగనూరు పట్టణంలో ప్రధాన కూడలిలో ఉన్నటువంటి తోపుడు బండ్ల వ్యాపారస్తులకు చెత్తబుట్టలు ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు మరియు మెప్మా సిబ్బంది జయవర్ధన్ సి ఓ లు శానిటేషన్ సిబ్బంది లక్ష్మన్న పాల్గొనడం జరిగింది. ప్రతి ఒక్క వీధి వ్యాపారస్తులు తమ తోపుడుబండ్ల నుంచి వచ్చినటువంటి చెత్తను బుట్టలో ఉంచుకొని మున్సిపల్ వాహనానికి గాని మున్సిపల్ సిబ్బందికి గాని అందజేసి నగర పరిశుభ్రతలో పాటుపడాలని తెలియజేస్తూ ఎవరైతే చెత్తను ఆరు బయట వేసినట్లయితే వారికి 1000 రూపాయలు జరిమానా విధించబడును అని తెలియజేయడం జరిగింది. కావున పట్టణంలో ఉన్నటువంటి తోపుడు వల్ల వ్యాపారస్తులు అందరు కూడా ఈ విషయమై పరిశుభ్రతలు భాగ్యస్వాములు కావాలని వారు తెలియజేయడం జరిగింది.

## సంతోష్ ట్రోఫీ ప్రా బబుల్స్ జట్టులోకి ఎంపికైనఎమ్మిగనూరు ఫుట్బాల్ క్లబ్ కు చెందిన బి.వీరేష్ ,బి.వంశీ, వివేకానంద..



విభారె న్యూస్ అక్టోబర్ 23 ఎమ్మిగనూరు..ఈనెల 8 9 10 తేదీలలో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్బాల్ టోర్నమెంట్లో చక్కటి ప్రతిభ కనబరిచి కర్నూలు జట్టు రెండవ స్థానం సాధించడం జరిగింది,రెండవ స్థానం సాధించడానికి ప్రధాన కారకులైన వీరేష్, వంశీ వివేకానంద సంతోష్ ట్రోఫీ ప్రాబబుల్స్ జట్టులోకి ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ వారు తీసుకోవడం జరిగింది ఎమ్మిగనూరు ఫుట్బాల్ క్లబ్ కు చెందిన క్రీడాకారులు ఎంపిక పట్ల కోచ్ మాబూ సాహెబ్ ఆనందం వ్యక్తం చేశారు, సంతోష్ ట్రోఫీ ప్రాబబుల్స్ జట్టులోకి ఎంపికైన క్రీడాకారులకు ఆల్ ఇండియా క్రిస్టియన్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లెలల్ఫ్రెడ్ రాజు క్రీడాకారులకు వారి కోచింగ్ క్యాంపుకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది క్రీడాకారులు ఎంపిక పట్ల క్లబ్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు మల్లెల గ్రూప్ ఆల్ ఫ్రైట్ రాజు మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాకారులకు మా సహాయం ఎల్లవేళలా ఉంటుందని తెలపడం జరిగింది.

## కాలేజీ గ్రౌండ్లో టపాసులకు అనుమతులు ఇవ్వకండి: ఎం ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి నగేష్



అనంతపురం ప్రతినిధి విభారే న్యూస్ అక్టోబర్ 23 ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టపాసులు అమ్మకాలకు జనసంచారం లేని ప్రదేశాల్లో అనుమతులు ఇవ్వాలని అలాగే అన్ని మండలాల అధికారులకు మరియు ఫైర్ స్టేషన్ అధికారులకు ఇదివరకే విన్నవించడం జరిగింది అన్నారు ఇందులో భాగంగానే అనంతపూర్ జిల్లాలో ఉరవకొండ గుంతకల్ కళ్యాణదుర్గం రాయదుర్గం తదితర ప్రాంతాల్లో టపాసుల విక్రయాలకు జనసంచారం లేని ప్రదేశాల్లో అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆయా మండలాల్లో అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనసంచారం ఉన్న ప్రదేశాల్లో గాని రద్దీగా ఉన్న ప్రదేశంలో గానీ టపాసులు అమ్మటం వల్ల ఏదైనా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే చిరు వ్యాపారులతో పాటు ప్రయాణికులైతేనేమి స్థానికంగా ఉన్నటువంటి ప్రజలు మరియు విద్యార్థులకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉ ంటుందని ఉద్దేశంతోనే మేము డిమాండ్ చేస్తున్నామన్నారు ముఖ్యంగా కాలేజీ గ్రౌండ్లలో అనుమతులు ఇచ్చే ముందు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఎం ఎస్ యు ఐ విద్యార్థి సంఘం తరపున మేము డిమాండ్ చేస్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్ కార్తికేయ విష్ణు తదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190